

ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్‌కు బహుమతి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గడ్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ బోర్డ్, కార్టూన్ వాచ్ పత్రికల నిర్వహణలో జాతీయస్థాయిలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో నగరానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్‌కు తృతీయ బహుమతి లభించింది. ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్, వీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు త్రియంబక్ శర్మ తెలిపారు.

ప్రయివేట్ స్కూళ్లలో ఫీజుల దందా

- చోద్యం చూస్తున్న విద్యాశాఖ
- పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు
- ఉక్కిరి బిక్కిరవుతున్న తల్లిదండ్రులు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారుల నియంత్రణ కరువైంది. ఏటా ఫీజులు పెంచుతూ భారీగా వసూలు చేస్తున్నా కనీస చర్యలు తీసుకునే వారు లేరు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేదు. నామమాత్రంగా తనిఖీ చేస్తూ వదిలేస్తున్నారు. గుర్తింపు లేని పాఠశాలలపైనా చర్యలు చేపట్టడం లేదు. కొన్ని పాఠశాలలకు నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 650 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రైవేట్ విద్యాసంస్థల్లో లక్షా 25 వేల మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో కరోనా సమయంలో ఆన్‌లైన్ పేరిట కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహించి భారీగా ఫీజులు వసూలు చేశారు. విద్యార్థులకు నామమాత్రం తరగతులను నిర్వహించి మొత్తం ఫీజును తీసుకున్నారు.

ఫౌండేషన్ పేరుతో అదనపు వసూలు

ప్రస్తుత విద్యాసంవత్సరం మొదటినుంచే భారీగా ఫీజులను పెంచారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఐఐటి ఇతర ఫౌండేషన్ల పేరిట తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పి సంవత్సరానికి రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు సంస్థలను బట్టి ఫీజులను వసూలు చేస్తున్నారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు నెలవారీగా రూ.1500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఫీజులు ఒకేసారి 20 నుంచి 40 శాతం వరకు పెరగడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. చాలా పాఠశాలల్లో రేకుల భవనాలే తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. ఎలాంటి వెలుతురు ఉండడం లేదు. పిల్లలకు ఆడుకోవడానికి కూడా గ్రౌండ్ లేదు. అనుమతుల సమయంలో విద్యాశాఖ చేతివాటం వల్ల విద్యార్థులకు క్రీడాసౌకర్యాలు ఎండమావిగా మారుతున్నాయి. అలాగే పాఠశాల యాజమాన్యాలు వారికి అనుకూలమైన వారిని పెట్టుకుని పేరెంట్స్ కమిటీల సమావేశాలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి.

యథేచ్ఛగా యూనిఫారాలు, పుస్తకాల విక్రయాలు

నోటు పుస్తకాలు, బ్యాగులు, స్కూల్ డ్రెస్‌ల పేరు మీద భారీగా వసూలు చేస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు కొన్ని తరగతులకే అనుమతులు తీసుకుని అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ అనుమతులు లేకుండా తరగతులను కొనసాగిస్తున్నారు. 10వ తరగతిలో వేరే పాఠశాలల పేరు మీద అనుమతులు తీసుకోవడం, ప్రైవేట్ క్యాండెట్‌గా పరీక్షలు రాయించడం వంటివి చేస్తున్నారు. ఇదంతా విద్యాశాఖధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంలో ప్రతి సంవత్సరం భారీగానే చేతులు మారుతున్నాయి. నగరంలో పలు చోట్ల ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వాహకులు గుర్తింపు లేకుండానే పాఠశాలల నిర్వహణ చేస్తున్నారు.

పాఠశాలల్లో ఫీజులు భారీగా పెంచారు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు బాగా పెంచారు. కరోనా తర్వాత ఖర్చులు పెరిగాయని 30 శాతం వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతికి రూ.15 వేలు చెల్లించాలని కోరారు. బుక్స్, డ్రెస్‌లకు అధికంగా తీసుకుంటున్నారు. ఇద్దరు పిల్లలకు గత సంవత్సరం కంటే 30 శాతం అధికంగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ప్రైవేట్‌లో ఫీజులు ఇలా పెంచితే చదివించే పరిస్థితి లేదు. అధికారుల పర్యవేక్షణ పెరగాలి. ఫీజుల నియంత్రణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి.

- ఎస్.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం, ఆర్యాపురం.

జనాభా నిర్వహణపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జనాభా సమతుల్యత సాధించే దిశలో జూన్ 20 లోగా జనాభా నిర్వహణ విధానంపై ఆలోచనలు పంచుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పిలుపు ఇచ్చారు. జనాభా నిర్వహణ విధానం పోస్టర్‌ను కలెక్టరేట్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్రంలో జనాభా సమతుల్యత లక్ష్యంగా జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ)పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. జనాభా నిర్వహణ విధాన రూపకల్పనలో జిల్లాలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ముఖ్య ప్రణాళిక శాఖ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందు కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తొమ్మిది ప్రశ్నలకు సంబంధించి ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను ఈ నెల 20వ తేదీలోగా పంచుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబ అభివద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న జనాభా మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించే యోచనలో ఉన్నట్లు, అందులో భాగంగానే ప్రజల నుంచి విలువైన సూచనలు సలహాలతో కూడిన అభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. మారుతున్న ప్రజల అవసరాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రత్యేక వ్యూహాలు, విధానాలు రూపొందించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జెడిఎల్.అప్పలకొండ, జెడ్‌పి సిఇఒ లక్ష్మణ రావు, డిపిఒ వి.శాంతామణి, డిఇఒ కె.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌పి బివి.గిరి, జిల్లా భూగర్భ జల అధికారి వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

10న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఈ నెల 10 లేదా 11వ తేదీల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బొమ్మూరులో ఆర్‌టిఐహెచ్ భవన ఏర్పాటు పనులను నగర కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతికత, ఇన్నోవేషన్ యువతలోని నైపుణ్యం కలిగిన వారికి వారి అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్‌టిఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాలలో ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మన జిల్లాలో అడ్వాన్స్ స్కోప్ మోడల్‌లో ఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించుకోనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ హబ్ నిర్వహణ విషయంలో గ్రీన్ కో ఎనర్జీ, ఒఎన్‌జిసి, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎస్‌పి డి.నరసింహకిషోర్, మున్సిపల్ కమిషనర్ కేతన గార్గ్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

ప్రజాశక్తి -కడియం

తల్లిదండ్రుల ఆస్తులు పంచుకునే రోజుల్లో తండ్రి ఆశయాలు పంచుతున్న పల్ల వెంకన్న కుమారులు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గణపతి ఆదర్శనీయులని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ప్రశంసించారు. పల్ల వెంకన్న 89వ జయంతి వేడుకలు కడియపులంకలో ఆయన విగ్రహం వద్ద పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు , వేమగిరి బుద్ధవిహార్ నిర్వాహకులు జగదీశ్వరావు, నర్సరీ రైతులు, గ్రామస్తులు పాల్గొని వెంకన్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలల నుండి పదవ తరగతిలో టాపర్లుగా నిలిచిన 11 మందికి కలిపి రూ.లక్ష నగదు, జ్ఞాపికలు, సర్టిఫికెట్స్‌తో కె.వాసుదేవరావు సత్కరించారు. నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్ల వెంకటేష్, వినయ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



టాపర్లకు నగదు, జ్ఞాపికలు అందజేస్తున్న పల్ల సోదరులు

రొయ్యల చెరువుల పరిశీలన

ప్రజాశక్తి -గోపాలపురం

అనాధికారికంగా చేపలు, రొయ్యలు చెరువులు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు షేక్ సైదున్నీసా అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం మత్స్యశాఖ అధికారి పి.కృష్ణవేణి భీమోలు పరిధిలోని చెరువులను, నష్టపోతున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వారి గోడును మత్స్యశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. భీమోలు పరిధిలోని 216 1బి19తో పాటు పలు భూములలో సన్న చిన్న కారు రైతులు పంట సాగు చేసుకుని జీవిస్తున్నారు. ఈ భూములు చుట్టూ ఇతర ప్రాంతాల నుండి వచ్చి వ్యవసాయ భూములలో భారీ స్థాయిలో రొయ్యలు, చేపల చెరువులు ఏర్పాటు చేశారు. పలు చెరువులకు అనుమతులు కూడా లేకుండానే చెరువులు ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై మత్స్యశాఖ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

వికలాంగ బాలలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో వికలాంగ విద్యార్థుల సర్వే ముమ్మరంగా సాగుతోందని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త కనక బాబు అన్నారు. తాడితోట భవిత కేంద్రంలో ఇంతవరకు 18 మందిని గుర్తించామని, సమగ్ర శిక్ష ద్వారా జిల్లావ్యాప్తంగా వికలాంగ విద్యార్థుల గుర్తింపు కార్యక్రమం మే 13 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 9 వరకు కొనసాగుతుందన్నారు. స్థానిక తాడితోటలోని భవిత కేంద్రంలో సర్వే వివరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బి.చిట్టి, మేరీ రాణి పాల్గొన్నారు.

చారిత్రక, పర్యాటకంగా నగరాభివృద్ధి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరంప్రతినిధి

నగరంలో హేవ్‌లాక్ వంతెనను చారిత్రక, పర్యాటక ప్రాంతంగా చేసేందుకు రూ.100 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, దానికి అనుబంధంగా 50 కోట్లతో ఘాట్లను అభివద్ధి చేస్తామని సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక పేపర్ మిల్లు వద్ద కృష్ణ సాయి కల్యాణ మండపంలో రాజమండ్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో న్యాయవాది మద్దూరి శివ సుబ్బారావు అధ్యక్షతన, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వర రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన అఖిలపక్ష సమావేశంలో ఎంఎల్‌ఎ వాసు మాట్లాడారు. గోదావరి గట్టు వెంబడి ఉన్న 13 మహనీయుల విగ్రహాలను తొలగించబోమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గోదావరి గట్టు సుందరీకరణ పేరుతో రివర్ ఫ్రంట్ నిర్మాణ క్రమంలో అక్కడ ఉన్న విగ్రహాలను తొలగిస్తారని వస్తున్న వార్తలను ప్రస్తావించారు. ఆ విగ్రహాలన్నిటినీ ఒకటే యూనిఫాంగా ఉంచుతామని తెలిపారు. రివర్ ఫ్రంట్ నిర్మాణం వల్ల పిండాల రేవు ఉనికికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టికె.విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో చొరవ చూపి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కేంద్ర కార్యాలయాన్ని నగరానికి తీసుకు రావడం అభినందనీయమన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు లక్షల సంఖ్యలో యాత్రికులు రానున్నందున, ఆ మేరకు వేగంగా నగరాభివృద్ధి జరగాలంటే, కార్పొరేషన్ ఎన్నికలు వెంటనే జరిపించాలని సూచించారు. బొమ్మూరులో నిర్మితమైన సైన్సు మ్యూజియంను ప్రారంభించాలని, చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌ను అనుకుని ఉన్న ప్రదేశంలో సర్వీస్ రోడ్డు వేయాలని, ఫ్లయ్ ఓవర్‌పై వీధి దీపాలు వేయాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు మాట్లాడుతూ మాజీ ఎంఎల్‌ఎ చిట్టూరి ప్రభాకర చౌదరి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు పలు తీర్మానాలను అఖిలపక్ష సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ రౌతు సూర్యప్రకాశరావు, పంతం కొండలరావు, దేశిరెడ్డి బలరామనాయుడు, విగ్రహాల పరిరక్షణ కన్వీనర్ మాదేటి రవి ప్రకాష్, మాదిరాజు శ్రీనివాస్, సానబోయి రామారావు, ఎల్‌వి.ప్రసాద్, కెకె.సంజీవరావు, అబ్దుల్లా షరీఫ్, అసదుల్లా అహ్మద్, దూర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

మౌలిక వసతులు కల్పించే దిశగా దృష్టి పెట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్

నగరంలో పెరుగుతున్న జనసాంద్రతకు తగ్గట్లుగా మౌలిక వసతులు కల్పించే దిశగా పాలకులు దృష్టి సారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ సూచించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఉదయం 30 నిమిషాలు, సాయంత్రం 30 నిమిషాలకు మించి తాగునీరు సరఫరా చేయలేకపోతున్నారని, శివారు ప్రాంత ప్రజలకు గోదావరి నీరు లభించటం లేదని తెలిపారు. చిన్నపాటి వర్షాలకే నగరం ముంపు బారిన పడుతోందని, ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునకీరణ వంటివి ప్రాధాన్యతలుగా గుర్తించాలని కోరారు. పుష్కరాల నేపథ్యంలో అభివృద్ధి పేరుతో రూ.కోట్లు ఖర్చు చేయనున్నారని, ఈ నేపథ్యంలో జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు. అఖిలపక్ష పార్టీలతో, మాజీ ప్రజాపతినిధులతో సమావేశమై సూచనలు సలహాలు తీసుకోవాలని సూచించారు. నగర కార్పొరేషన్ దామెర్ల ఆర్ట్ గ్యాలరీ నిర్వహణ బాధ్యతలను చేపట్టాలని, బొమ్మూరులో ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియం త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

పాఠశాల తరగతుల తొలగింపుపై ఆందోళన

ప్రజాశక్తి -కొవ్వూరు

దొమ్మేరులోని ఇందిరమ్మ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఉన్న మూడు, నాలుగు ఐదు తరగతి విద్యార్థులను వేరొక పాఠశాలలో విలీనం చేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం గ్రామస్తులు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. 1930 నుంచి తమ పాఠశాల కొనసాగుతోందన్నారు. తమ ప్రాంతంలోని పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేవలం రెండు తరగతులు మాత్రమే ఉండడం మూలంగా దళిత విద్యార్థులు చదువుకి దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ తానేటి కుమారి, వైసిపి నాయకుడు ముదునూరి నాగరాజు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న దొమ్మేరు వాసులు

శేషారావు ప్రమాణ స్వీకారానికి తరలిన అభిమానులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు బూరుగుపల్లి శేషారావు తాడేపల్లికి గురువారం ఉదయం వేలివెన్నులో ఆయన స్వగృహం నుంచి భారీ అనుచరగణంతో తరలి వెళ్లారు. తెల్లవారుజాము నుంచి వివిధ గ్రామాల నుంచి పదుల సంఖ్యలో చేరుకున్న తెలుగుదేశం పార్టీ, నాయకులు, కార్యకర్తలు అభిమానులతో వేలివెన్ను శశి పాఠశాల ప్రాంగణం నిండిపోయింది. శేషారావు ఇంటివద్ద పసుపు రంగు పువ్వులు, పసుపు రంగు చొక్కాలు ధరించిన కార్యకర్తలతో శేషారావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో మారు మోగింది. 300 కార్లు, బస్సులుతో నిడదవోలు వైపు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

పారా మెడికల్ కోర్సులో టాపర్‌గా శ్రీవల్లి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో చర్చిపేటకు చెందిన పిట్టా శ్రీవల్లి పారామెడికల్ ఫస్ట్ ఇయర్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అమలాపురంలోని కిమ్స్ కాలేజీ ఆఫ్ పారా మెడికల్స్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రీవల్లి 650 మార్కులకు గాను, 547 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. శ్రీవల్లిని కాలేజీ యాజమాన్యం, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు అభినందించారు.

శ్రీగౌతమి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

శ్రీగౌతమి స్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోట్ బుక్స్ అమ్ముతుండగా ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టుకున్నారు. తక్షణమే పాఠశాలపై చర్యలు తీసుకుని జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలపై తనిఖీలు చెయ్యాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ శ్రీ గౌతమి స్కూల్లో లక్షల్లో పుస్తకాల వ్యాపారం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని వెంటనే డిఐ దిలీప్, డిఇఒకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. కె.జ్యోతిర్మయి, జోసెఫ్, లహరి, హేమంత్, కార్తిక్, దిలీప్ పాల్గొన్నారు.

సర్పంచ్ రామ్‌జీ పీఠం పదిలం

ప్రజాశక్తి -కడియం


కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాణి రెండున్నరేళ్ల క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మరణంతో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఉప సర్పంచ్‌గా ఉన్న పాఠంశెట్టి వెంకట రామారావు (రామ్‌జీ) సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. కాగా కొందరు వార్డు సభ్యులు ఇటీవల రామ్‌జీపై అవిశ్వాసానికి దరఖాస్తు చేశారు. ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ అధ్యక్షతన, డిఎల్‌పిఒ నాగలత, కడియం తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ కె.రమేష్ ఆధ్వర్యంలో గురువారం కడియపులంక పంచాయతీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. మొత్తం పంచాయతీ వార్డు సభ్యులు 18 మంది కాగా అందరూ హాజరయ్యారు. అవిశ్వాసానికి అనుకూలంగా 11 మంది, వ్యతిరేకంగా ఏడుగురు తమ నిర్ణయాన్ని చేతులెత్తి ప్రకటించారు. ఒక్క ఓటు తేడాతో అవిశ్వాసం వీగిపోయింది. దీంతో కడియపులంక పంచాయతీ సర్పంచ్ పీఠం పాఠంశెట్టి రామ్‌జీకి పదిలంగా నిలిచింది.

బూరుగుపల్లి శేషారావుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - నిడదవోలు

బూరుగుపల్లి శేషారావుకు నిడదవోలు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణకు తాడేపల్లికి బయల్దేరిని ఆయనకు, నిడదవోలు పట్టణం చేరుకోగానే, టిడిపి పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

కార్టూ'నిజం'



ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం వనం-మనం కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం జిల్లావ్యాప్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 4 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి హాజరయ్యారు. ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కె.వాసుదేవ రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కెఎన్.జ్యోతి పాల్గొన్నారు. డిఐ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ స్థానిక ఎస్‌కె.బెట్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు.

పెరవలి ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, ఎంపిడిఒ కె.ఉమారాజ్యలక్ష్మి పద్మజ మొక్కలు నాటారు. తహశీల్దారు డి.అచ్యుత్ కుమారి, టిఎ వెంకన్న బాబు, సర్పంచులు గంగోలు సీతమ్మ, గుబ్బల ఆదిలక్ష్మి, బండారు వెంకటరమణ, భావన మధు పూర్ణ చందు, బంటుమిల్లి రత్నాజీ పాల్గొన్నారు

కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్రే నాగ మురళి, ఎపిపి కె.గోపాలకృష్ణ, న్యాయవాదులు యాగంటి చలపతిరావు, వై.ప్రకాష్, టి.ప్రభాకర్ పాల్గొన్నారు.

కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎంపిడిఒ రమేష్ బాబు మొక్కలు నాటారు. జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, ఎఒ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ దేవదాసు పాల్గొన్నారు..

ఉండ్రాజవరం తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్, ఎపిఎం టి.బాలకోటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా స్వయం సహాయక సంఘాలకు మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంపిడిఒ వివివిఎస్ రామారావు, పాల్గొన్నారు.

నిడదవోలు వన మహోత్సవంలో చైర్‌పర్సన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గణపతి సెంటర్ నుండి గణేష్ చౌక్ వరకు బారీ ర్యాలీ గా వెళ్లి ప్రతిజ్ఞ చేశారు. వైస్ చైర్‌పర్సన్ షేక్ వజీరుద్దీన్, కౌన్సిలర్స్ గోపిరెడ్డి శ్రీనివాస్, పువ్వల రతీదేవి, డిఇ డి.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, పలువురు వక్తలు మొక్కలు నాటారు. రేకపల్లి ముత్యాలరావు, పెద్దేవంలో సర్పంచ్ టి.వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, కార్యదర్శి సాంబమూర్తి, వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మొక్కలు నాటారు.



రాజమండ్రిలో పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మనస్థాపానికి గురై ఒక వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాలు ప్రకారం మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన రేలంగి సుబ్బారావు (55) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో కుమారుడు మందలించగా మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సీతానగరం గ్రామానికి చెందిన కురుకూరి అబ్బులు అతని కుమారుడు రాము జగ్గంపేట నుంచి స్వగ్రామానికి వెళు తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అబ్బులు కాలుకు బలమైన గాయం కాగా, రాముకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రావెల్ తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో పోలవరం పుష్కర కాలువ గట్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గురువారం తెల్లవారుజామున విఆర్ఓ దొండపాటి చంటిబాబుతో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్, లోడ్ చేస్తున్న జెసిబిని స్వాధీనం చేసుకుని, వాటి డ్రైవర్లు ఇంతిపల్లి జ్యోతిబాబు, లొండ శంకర్‌ను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. తాటిపర్తికి చెందిన స్వామి ఆధ్వర్యంలో ఈ గ్రావెల్ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భారీ కొమ్మపడి చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక బస్టాండ్ వెనుక విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మ పడడంతో విద్యుత్ వైర్లు తెగిపడి అక్కడే ఆడుకుంటున్న చిన్నా పాతూరి అక్షర (9)కు తగలడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. గాయపడిన మరొక చిన్నారిని దేవదాసి లిషితను హుటాహుటిన రాజమహేంద్రవరంలోని విజయసాయి హాస్పటల్లో జాయిన్ చేర్చారు. ఈ సంఘటనతో పాతపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.



పెరటు మొక్కల పెంపకంపై మాట్లాడుతున్న పాటంశెట్టి

ఊపిరి కోసం మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఊపిరి కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచాలని ప్రకృతి ప్రేమికుడు పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తన ఇంటి వద్దనే అమలు చేస్తున్న వర్మి కంపోస్ట్ విధానాలను గురువారం ఆయన పాత్రికేయులకు వివరించారు. ప్రతి మనిషి రోజుకి 20 వేల నుంచి 22 వేల సార్లు ఊపిరి తీసుకుని వదులుతామని, మనం తీసుకునే గాలిలో ప్రాణవాయువైన ఆక్సిజన్‌ని మొక్కలు ఇస్తాయని అన్నారు. మనం విడుదల చేసే కార్బన్ డయాక్సైడ్ మొక్కలు తీసుకుంటాయని తెలిపారు. మనిషి లేకపోయినా మొక్క పెరగగలదని, మొక్క లేకపోతే మానవులతోపాటు సకల జీవరాసులకు మనుగడ ఉండదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున వనమహోత్సవం పేరుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్క రోజులో కోటి మొక్కలు నాటాలని పిలుపునివ్వడం శుభపరిణామం అన్నారు. నాటిన ప్రతి మొక్క వృక్షం అయ్యేవరకు సంరక్షించే విధంగా నాటిన ప్రతి మొక్కకు ఒక కోడ్ నెంబర్ ఇచ్చే విధంగా ప్రతి మూడు నెలలకు ఆ మొక్క స్టేజ్ ఫోటోతో సహా ప్రభుత్వానికి నివేదించే విధంగా ఏర్పాటు చేసినట్లయితే వేల కోట్ల రూపాయలు ఆదాయం ప్రభుత్వం సృష్టించవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని ఆయన కోరారు.



ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం కార్యకర్తలు

మామిడికి మద్దతు ధర కల్పించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మామిడికి మద్దతు ధర ప్రకటించాలని, మామిడి రైతులకు కోల్డ్ స్టోరేజీలు ప్రభుత్వం నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ బంగినపల్లి మామిడిపండు టన్ను రూ.40 వేల నుంచి రూ.5 వేలకు పడిపోయిందన్నారు. కల్టర్ కాయ జ్యూస్ కంపెనీకి వేస్తే టన్ను రూ.నాలుగు వేలు ఇస్తున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం మామిడి రైతును ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, దేశెట్టి సురేష్, సుంకర శ్రీనివాస్, సిగిరెడ్డి త్రిమూర్తులు, కోట వీరబాబు, మాస అన్నవరం, మాదాపు అబ్బు తదితరులు పాల్గొన్నారు.

అపోలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని అపోలో ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ఒక మహిళ ప్రాణాన్ని కాపాడారు. సుమారు నాలుగు గంటలపాటు వైద్యులంతా శ్రమించి అన్న వాహిక నుంచి చొచ్చుకుని గుండె పెద్ద నరంలోకి చొచ్చుకున్న చేప ముల్లును తీశారు. ఈ విధంగా బహుశా జాతి స్థాయిలో ఈ తరహా కేసు రెండు మూడు కంటే ఎక్కువ ఉండవని ఆ వైద్యులు వెల్లడించారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్ర చికిత్స బృందం వైద్యులు వై.శివరామకృష్ణ, పి.నాగేశ్వరరావు, జి.వంశీచైతన్య వివరించారు. బిక్కవోలుకు చెందిన 54 ఏళ్ల జంపా మంగయ్యమ్మకి అన్నవాహిక ద్వారా చేప ముల్లు గుండె వద్దకు చేరిందన్నారు. ఆమెకు వివిధ పరీక్షలు నిర్వహించి చేప ముల్లు గుండె దగ్గర చొచ్చుకుని ఉండడం గమనించామన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకుండా చాతీ ఎముకలకు నష్టం కలిగించకుండా సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని ఈమెకు గుండె వద్ద ఇరుక్కుని ఉన్న చేప ముల్లును తొడల దగ్గర నుంచి గొట్టం ద్వారా ట్రేవర్ ప్రొసీడర్ అనే విధానంలో చికిత్స నిర్వహించి తొలగించామని చెప్పారు. ప్రస్తుతం ఆమె కోరుకుంటున్నారని త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. కష్ట సాధ్యమైన శస్త్ర చికిత్సను నిర్వహించి మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యులను అపోలో ఆసుపత్రి సిఇఒ ఆర్ఆర్ రెడ్డి అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

టిసిఎస్‌కు 485 మంది ఆదిత్య విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన 485 మంది విద్యార్థులు టిసిఎస్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సంస్థ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. గురువారం క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా టిసిఎస్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో 485 మంది విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని నాయుడు అన్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా టిసిఎస్ కంపెనీకి వందల సంఖ్యలో తమ విద్యార్థులు ఎంపిక అవుతున్నారని అన్నారు. డిగ్రీ మొదటి రోజు నుంచే అందిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ, పియర్సన్ మీ ప్రో ద్వారా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్, గ్రూప్ డిస్కషన్స్, సర్టిఫికేషన్ కోర్సుల వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఎంపికైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, ప్రిన్సిపల్స్ కె. కరుణ, డి.బ్యూలా, ఎండి.షాహిద్దీన్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్స్ అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన ఆదిత్య విద్యార్థులు

30వ రోజుకు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 30 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసిన భద్రరావు, వాకాడ భాస్కరరావు, ఆకుల రామకృష్ణ, అయ్యప్ప స్వామి, కె.వెంకటరమణ, ఒ.సోనియా, మహాపాతిన అరుణ్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు



చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

బాధితుని కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కరప

ముమ్మిడివరంలో ఇటీవల నీటమునిగి ప్రాణాలు కోల్పోయిన కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన తాతపూడి నితీష్‌కుమార్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.సత్యనారాయణ, కూటమి నాయకులు సుందరపల్లి సత్తిబాబు, సింగినేడి సత్తిబాబు, పి.వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపిడిఒ డి.శ్రీలలిత గురువారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. అనంతరం ఆమె చంద్రమాంపల్లి - దివిలి ఏలేరు బ్రిడ్జి వద్ద ఏలేరు కాలువలో డంపింగ్ చేసిన కూరగాయల వ్యర్థాలను పరిశీలించిన ఎంపిడిఒ డంపింగ్ చేసిన కూరగాయల మార్కెట్ వ్యాపారులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తిం వెంకట శ్రీనివాసరావు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, ఎపిఒ డి.సుధీర్, జెఇ వి.సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు గురువారం కూటమి నాయకులు స్థల పరిశీలన చేశారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో రోడ్ల పక్కనే చెత్త వెయ్యాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనిపై ఎంఎల్ఎ చినరాజప్పకు వివరించినట్లు స్థానిక నాయకులు చల్లా బుజ్జి తెలిపారు. ఈ నేపథ్యంలోనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం గ్రామంలో ఒక స్థలాన్ని గ్రామ నాయకులు పరిశీలించారు. ఎంఎల్ఎ చినరాజప్ప పరిశీలన అనంతరం కంపోస్ట్ యార్డు ఏర్పాటుకు నిర్ణయం జరగనున్నట్టు బుజ్జి తెలిపారు.

యానాం వార్తలు



మల్లాడి అభిమానులు నిర్వహిస్తున్న భారీ ర్యాలీ

మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు పురస్కరించుకుని మల్లాడి అభిమాన సంఘం, యూత్ ఆధ్వర్యంలో గురువారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యత్రా గార్డెన్స్ నుంచి ర్యాలీ నియోజకవర్గంలోని చింతా వారి వీధి, త్యాగరాయ వీధి, పాత బస్టాండ్, మెట్టకూరు, గోపాల్ నగర్, కనకాల పేట, యుకెవి నగర్, భీమ్ నగర్, కురసం పేట, ఫరంపేట, మీదుగా సావిత్రి నగర్ గిరియంపేట తిరిగి మల్లాడి స్వగృహం వద్దకు చేరుకుంది. యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని మల్లాడిపై అభిమానాన్ని చాటుకున్నారు. మల్లాడి స్వగృహం వద్ద శుక్రవారం మల్లాడి పుట్టినరోజు వేడుకలు అభిమానులు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహిళలకు, పురుషులకు, యువతి యువకులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం విజేతలకు మల్లాడి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం యానాంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. చెట్లను పెంచడం వల్ల జనజీవనాన్ని రక్షించడానికి దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, ఎడిపిసి కమిడి ప్రభాకర్, కామిశెట్టి వేణుగోపాల్, దాట్ల దేవదానం రాజు, సాధనాల బాబు, చింతా రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హేండీక్రాఫ్ట్ ప్రదర్శన

యానాం సమగ్ర శిక్షణ అభియాన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో స్థానిక కోనవెంకటరత్నం కాలనీకి చెందిన పత్రి ధనలక్ష్మి ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, అధికారులు, విద్యార్థులు తిలకించారు. ధనలక్ష్మిని పలువురు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి పి.స్వాతి

ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయించరాదని, ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని పిఠాపురం వ్యవసాయ శాఖ అధికారిణి పి.స్వాతి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాలకు చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాల నాణ్యత ప్రమాణాల విషయంలో నిర్దిష్ట నిబంధనకు లోనై ఉండాలని అన్నారు. ఎంఆర్‌ఏపి ధరలకు మాత్రమే విక్రయించాలని, తొలుత విత్తనం మొలక శాతం పరీక్షించి 80 శాతం కన్నా ఎక్కువ మొలక ఉంటేనే రైతులకు అమ్మకాలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, యు.కొత్తపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారులు ఎ.అచ్యుతరావు, వి.జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

తమ గ్రామంలోని ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన పైపులైన్, వాటర్ ట్యాంక్ నిర్మాణాలను చేపట్టాలని రాగోలపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు అనపర్తి ప్రసాద్ కేంద్ర బృందాన్ని కోరారు. మండలంలోని రాగోలపల్లి, పోచవరం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను గురువారం కేంద్రం బృందం పరిశీలించింది. ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ బివి.గిరిని వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా చేసిన పనులే కాక పంచాయతీ ద్వారా ఎప్పటికప్పుడు పైప్‌లైన్ మరమ్మతులు, భూమిలో పాడైపోయిన పైపులను ఎప్పటికప్పుడు మారుస్తున్నామని తెలిపారు. గ్రామ

ప్రాధాన్యతా క్రమంలో పనుల కేటాయింపు

ప్రజాశక్తి -కొవ్వూరు

ఆర్థిక సంఘం నిధులు, మండల పరిషత్ సాధారణ నిధులు, ఇతర గ్రాంట్లను వినియోగించుకుని అన్ని గ్రామాలకూ ప్రాధాన్యతా క్రమంలో పనులు కేటాయిస్తామని ఎంపిపి కాకర్ల సత్యనారాయణ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. జెడ్‌పిటిసి బొంత వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి వీరమళ్ల నారాయుడు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ టిబివి.రమణ పాల్గొన్నారు.

వికలాంగులకు ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వికలాంగులకు వారి ఇళ్ల వద్దనే రేషన్ డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పలు రేషన్ దుకాణాలలో సరుకుల పంపిణీ, దుకాణాలను పరిశీలించారు. అనంతరం వడ్లూరులో శ్రీదేవికి చెందిన 18వ నెంబర్ రేషన్ షాప్‌నకు చెందిన లబ్ధిదారులు అంపిలి కొండమ్మ, తదితర లబ్ధిదారుల ఇళ్లకు ఆయన స్వయంగా వెళ్లి, రేషన్ సరుకులు అందించారు.

రేషన్‌లో వృద్ధులకు ఇబ్బంది కలిగించొద్దు

ప్రజాశక్తి-తాళ్లపూడి

రాష్ట్రంలో అమలవుతున్న రేషన్ పంపిణీ విధానంలో సరుకులు అందించడంలో వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది కలిగించవద్దని కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత అన్నారు. తాళ్లపూడిలోని చౌక దుకాణాల్లో వృద్ధులు, వికలాంగులకు రేషన్ పంపిణీ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించేందుకు ఆర్‌డిఒ గురువారం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించిన అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆర్‌డిఒ రేషన్ అందజేశారు. ఆమె ఆర్ఐ రామకృష్ణ, విఆర్ఒలు ఉన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గోకవరం

నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ పెట్టి వారిని జైలుకి పంపుతామని నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ అన్నారు. గురువారం గోకవరంలో ఎస్ఐ పవన్ కుమార్‌తో కలిసి రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా ముందస్తు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మూసిఉన్న కబేళాలను పరిశీలించారు. అనుమతులు లేని జంతు వధశాలలు నిర్వహిస్తే చట్ట రీత్యా శిక్షార్హులు అవుతారని తెలిపారు. డ్రైవర్స్ కాలనీలో ఉండే తెలగపాముల తెగ పెద్దలతో మాట్లాడి ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గోకవరం తంటికొండ ఆర్చ్ వద్ద అంతర జిల్లా చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు, గొల్లప్రోలు, సామర్లకోట

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు చేపట్టే మరమ్మతుల పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజరం సబ్ స్టేషన్ పరిధి లోని కోలంక, చలివేంద్రపాడు, నామవానిపాలెం, పొలమూరు పాడు, ఉప్పుమిల్లి గ్రామా లతోపాటు, ఆక్వా, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. అలాగే గొల్లప్రోలు మండలంలో ఆర్‌డిఎస్ఎస్ పథకంలో 24 గంటల విద్యుత్ సరఫరా లైను నిర్మాణం కోసం చేబ్రోలు సబ్ స్టేషన్‌లో చేపట్టే మరమ్మతుల నిమిత్తం శుక్రవారం చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు, దుర్గాడ, మల్లవరం, ఎ.విజయ నగరం గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫర ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ కట్టింగ్, మరమ్మతుల పనుల కోసం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉండూరు, పి.వేమవరం, కాపవరం, గొంచాల, బ్రహ్మానందపురం, చంద్రంపాలెం, నవర, పవర, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపార సంస్థలు, బ్రాందీ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల యాజమానులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య వివరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా 'బయోలైట్' సంస్థ తయారు చేసిన ఉత్పత్తులు, వాటర్ బాటిల్లు, గ్లాసులు, క్యారీ బ్యాగ్లు, కూర కవర్స్, పేపర్ ప్లేట్లు, టిఫిన్ చట్నీ కవర్స్, స్ట్రాలు, బిర్యానీ బాక్సులు గురించి అవగాహన కల్పించారు. ఈ ఉత్పత్తులు భూమిలో కలిసిపోయే విధంగా తయారు చేయబడినవి కావడంతో పర్యావరణ పరిరక్షణకు సహాయపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'బయోలైట్' సంస్థ ప్రతినిధి పోడూరి వంశీ ధీక్షిత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలను ప్రారంభిస్తున్న విమలాదేవి జైన్

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలకపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో గురువారం చిత్రలేఖన పోటీలను విమలాదేవి జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించిననట్లు తెలిపారు. ఈనెల 9న జరిగే సమ్మర్ క్యాంపు ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అమృత, నమ్రత, అనూష, అంజలి, జస్విత, లలిత, నాని, సాయి, బంగారం, నేహా, రేణుక పాల్గొన్నారు.